క్లుప్తంగా

120 మందికి కంటి పరీక్షలు

రాజాం సిటీ: స్థానిక సెయింటాన్స్ స్త్రీశక్తి కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 120 మందికి రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 25 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో విలియమ్ మేయర్ డవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ సిస్టర్ హిల్డా, వైద్యులు వై.అప్పలకొండ, ఎం.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న గోరుముద్ద' నిర్వహణ బాగుండాలి

రేగిడి: జగనన్న గోరుముద్ద పథకం సక్రమంగా అమలయ్యేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు అన్నారు. మండలంలో మజ్జిరాముడుపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోరుముద్ద వంటలను పరిశీలించారు. మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అని ఆరాతీశారు. భోజనానికి ముందు, తరువాత చేతులు శుభ్రం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎం భువనేశ్వర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పంట రుణాలు రెన్యువల్ చేసుకోండి

సంతకవిటి: స్థానిక కో–ఆపరేటివ్ సొసైటీలో తీసుకున్న పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలని చైర్మన్ ఎస్వీ రమణారావు సూచించారు. మండల కేంద్రంలోని కో–ఆపరేటివ్ బ్యాంక్ వద్ద బుధవారం సీఈఓ రమణతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఫిబ్రవరి నెలాఖరులోగా 7 శాతం వడ్డీ చెల్లించి, రుణాలను రెన్యువల్ చేసుకోవాలన్నారు. లేకపోతే అసలుతో పాటు 13 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నారు. రెన్యువల్‌కు ఆధార్ కార్డు, 1బీ, మొబైల్ నంబర్‌తో సొసైటీలో సంప్రదించాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

రాజాం సిటీ: పట్టణంలోని కూరాకులవీధికి చెందిన పెద్ది వెంకటేష్ అదృశ్యంపై బుధవారం కేసు నమోదుచేసినట్లు ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు. ఈ నెల 20న కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకు వెళ్లిన ఆయన ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికారని, ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంకటేష్ తల్లి శార్వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైకు ఢీకొని వ్యక్తికి గాయాలు

బొబ్బిలి: స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్సై జి.భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పాత బొబ్బిలికి చెందిన కుప్పాన ఉదయ్‌కుమార్ బొబ్బిలి వస్తుండగా ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ ఉమర్ ఎదురుగా వస్తూ ప్రమాదవశాత్తు ఢీకొన్నాడు. దీంతో ఉదయ్‌కుమార్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని బొబ్బిలి నుంచి జిల్లా కేంద్రాస్పత్రికి, అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై భాస్కరరావు తెలిపారు.

జాతీయ సైన్సు పోటీల్లో బాలభవన్ విద్యార్థులు

రాజాం: రాజాం బాలభవన్‌కు చెందిన ఎ.అమిత్(9వ తరగతి), ఇ.షణ్ముఖసాయి(9వ తరగతి), ఎస్.కోమలసాయిబాలజీ(8వ తరగతి) విద్యార్థులు గుజరాత్‌లో జున్నాగడాలో జరుగుతున్న జాతీయ స్థాయి సైన్సు పోటీల్లో పాల్గొన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజంపై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్‌ను ప్రదర్శించినట్లు బాలభవన్ పర్యవేక్షకులు డాక్టర్ సుంకరి రమేష్ బుధవారం తెలిపారు. గురువారం విజేతల వివరాలు వెల్లడించనుందని తెలిపారు.

హామీలు అమలు చేయాలని డిమాండ్

బొబ్బిలి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 26న పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద నిరసన కార్యక్రమాన్ని తలపెట్టినట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు తెలిపారు. బుధవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. మోదీ పాలనలో అంబానీ, అదానీలు ప్రపంచ కుబేరుల జాబితాలో చేరారన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న పదేళ్లలో దేశంలో లక్షా 50వేల మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి గోపాలం, ఇఫ్టూ నాయకులు మెరిగాని గోపాలం, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రటరీ మునకాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు గుర్తించాలి

తెర్లాం: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరంలో వేతనదారులందరికీ పనులు కల్పించేలా క్షేత్ర, సాంకేతిక సహాయకులు కొత్త పనులు గుర్తించి, నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాలని ఆ పథకం పీఓ, మండల ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో బుధవారం క్షేత్ర, సాంకేతిక సహాయకులతో ఏపీఓ సుశీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఉపయోగకరమైన పనులు గుర్తించాలని, వేతనదారులందరికీ వందరోజుల పనిదినాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

బేటీ బచావో.. బేటీ పడావో..



బొబ్బిలి: మానవహారంగా ఏర్పడిన ప్రతిజ్ఞ చేస్తున్న కేజీబీవీ విద్యార్థినులు

- ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం
- లింగ వివక్ష, బాల్య వివాహాల నిర్మూలనకు వక్తల పిలుపు

జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, పాఠశాలల్లో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని, లింగ వివక్షత, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలికల విద్య, ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. కౌమార దశలో బాలికలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను ఐసీడీఎస్ సిబ్బంది విద్యార్థినులకు వివరించారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థినులతో మానవహారం ఏర్పాటు చేసి బాలికా దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. బొబ్బిలి కేజీబీవీలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ పి.బ్రహ్మాజీరావు, ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



తెర్లాం: కుమ్మరిపేట కేజీబీవీలో విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ త్రినాథరావు



రాజాం సిటీ: ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థినికి బహుమతి అందిస్తున్న హెచ్‌ఎం మాధురి, ఉపాధ్యాయులు



బాడంగి: కేజీబీవీలో విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న సీడీపీఓ రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ హరిత, తదితరులు



సంతకవిటి: వాసుదేవపట్నం కేజీబీవీలో 'హ్యాపీ గర్ల్ చైల్డ్ డే' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు



సంతకవిటి: బేటీ బచావో, బేటీ పడావో నినాదంతో ఓ విద్యార్థిని ప్రదర్శన



రాజాం: దోలపేట హైస్కూల్‌లో బాలికల హక్కులపై అవగాహన కల్పిస్తున్న జీఎంఆర్ఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



వంగర: విజేతలకు బహుమతులు అందిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రజనీదుర్గ



రేగిడి: దేవుదళ కేజీబీవీలో విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయులు

ప్రతిపక్షాల అసత్య ప్రచారాలు తిప్పికొట్టాలి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: రాష్ట్ర విభజన అనంతరం కట్టుబట్టలతో వచ్చాం, అనుభవమున్న వ్యక్తిని రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చేస్తాను అని బూటకపు కబుర్లు చెప్పి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన చంద్రబాబును నమ్మొద్దని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు అధ్యక్షతన బుధవారం పార్టీ కార్యకర్తలు, నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన చంద్రబాబు దోచుకోవడంతో పాటు నాయకులకు దోచిపెట్టాడని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతీ 2 వేల జనాభాకు రూ.కోటి ఖర్చుపెట్టి సచివాలయాలు, ఆర్బీకే, వెలనెస్ సెంటర్ తదితర కార్యాలయాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకొచ్చారని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 27న విశాఖ జిల్లా భీమిలిలో నిర్వహించే ఎన్నికల శంఖారావం సభకు కార్యకార్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంత చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, జేసీఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.



రామభద్రపురం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

బొబ్బిలి: ప్రపంచం మెచ్చిన మహా మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేస్తే టీడీపీ, తోక పార్టీ, ఎల్లో మీడియాలకు కంటగింపుగా మారిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న ఆదరణను చూసి తట్టుకోలేక ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అసత్య ప్రచారాలను ఎండగట్టాలని పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, సీనియర్ నాయకులు ఇంటి గోపాలరావు, తూముల భాస్కరరావు, జేసీఎస్ పట్టణ ఇన్‌ఛార్జి రేజేటి ఈశ్వరరావు(విసు), వైస్ చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, రమాదేవి, ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.


విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

మెంటాడ: నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను 24 గంటలు గడవకముందే విద్యుత్ సిబ్బంది సరిచేసి, సరఫరాను పునరుద్ధరించారు. మంగళవారం తెల్లవారుజామున టిప్పర్ ఢీకొనడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో సారాడవలస, మల్లేడవలస, కింద గూడెం, శిగడంవలస, సంగం గుడ్డివలస గ్రామాల్లో విద్యుత్ సరాఫరా నిలిచిపోయింది. వెంటనే స్పందించిన విద్యుత్‌శాఖ సిబ్బంది స్తంభాలను సరిచేసి సరఫరాను పునరుద్ధరించడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

నాలుగున్నరేళ్లలో పంచాయతీలకు రూ.5.43 కోట్లు విడుదల

- ఈఓపీఆర్డీ వెంకటరమణ

రామభద్రపురం: నాలుగున్నరేళ్లలో మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు దాదాపు రూ.5.43 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయని ఈఓపీఆర్డీ వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ అక్కారావుతో కలిసి బుధవారం ఆయన మాట్లాడుతూ.. 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరంలో నాలుగు విడతల్లో అన్‌టైడ్, టైడ్ కింద రూ.3.48 కోట్లు విడుదలైనట్లు చెప్పారు. అలాగే 2022–23 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతగా రూ.93.92 లక్షలు విడుదలయ్యాయన్నారు. ప్రస్తుతం 2023 ఏడాదికి సంబంధించి రెండో విడత కింద సుమారు కోటి రూపాయలు విడుదలయ్యాయని, పంచాయతీ ఖాతాల్లో నిధులు జమవుతున్నాయన్నారు. మొత్తంగా ఇప్పటి వరకు రూ.5.43 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. ఈ విడతలో ఆరికతోట పంచాయతీకి రూ.9.15 లక్షలు, బూసాయవలస రూ.3.78 లక్షలు, దుప్పలపూడి రూ.1.88 లక్షలు, గొల్లపేట రూ.2.99 లక్షలు, ఇట్లామామిడిపల్లి రూ.2.82 లక్షలు, జన్నివలస రూ.3.02 లక్షలు, కొండకెంగువ రూ.5.13 లక్షలు, కోటశిర్లాం 4.28 లక్షలు, కొత్తరేగ రూ.1.91 లక్షలు, కొట్టక్కి రూ.8.28 లక్షలు, మామిడివలస రూ.1.99 లక్షలు, మిర్తివలస రూ.3.74 లక్షలు, ముచ్చర్లవలస రూ.2.84 లక్షలు, నాయుడువలస రూ.4.34లక్షలు, నరసాపురం రూ.1.59 లక్షలు, పాతరేగ రూ.2.81 లక్షలు, రామభద్రపురం రూ.20.08 లక్షలు, రావివలస రూ.3.97 లక్షలు, రొంపల్లి రూ.4.88 లక్షలు, ఎస్.సీతారాంపురం రూ.2.14 లక్షలు, సోంపురం రూ.3.09 లక్షలు, తారాపురం రూ.రూ.4.93 లక్షలు చొప్పున విడుదలైనట్లు తెలిపారు. గ్రామపంచాయతీల సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తోందన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలకు అనుగుణంగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ వెంకటరమణ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని నందబలగ గ్రామంలో పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, పలు సంఘాల నేతలు, విశ్రాంత ఉద్యోగులు, యువతతో బుధవారం మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి గ్రామ పరిపాలనకు జీవం పోసారని, క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకే అన్ని సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు చేరుతున్నాయన్నారు. గ్రామాల్లోని ప్రజలంతా ఆర్థిక ప్రగతి సాధించారన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం మండల అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పంచాయతీ సర్పంచ్ కొర్ను ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ బింగి సూర్యనారాయణ, తాడ్డి గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బిందు, సూక్ష్మ సేద్యంతో పెట్టుబడులు ఆదా

- పీడీ లక్ష్మీనారాయణ



పక్కిలో పరికరాలను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీ నారాయణ, సిబ్బంది, రైతులు

బొబ్బిలి: బిందు, తుంపరలతో చేసే సూక్ష్మ సేద్యంతో రైతులకు పెట్టుబడులు ఆదా అవుతాయని మైక్రో ఇరిగేషన్ పీడీ పీఎన్వీ లక్ష్మీ నారాయణ అన్నారు. ఈ మేరకు బుధవారం బొబ్బిలి మండలంలోని మెట్టవలస, పక్కి గ్రామాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న సూక్ష్మ సేద్య పరికరాలను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బొబ్బిలి మండలంలోని పక్కిలో ఆరు, వెలగవలసలో 5, కమ్మవలసలో 3, మల్లంపేటలో రెండు యూనిట్లు ఏర్పాటు చేయగా గోపాలరాయుడి పేట, జీఎస్ఆర్ పురం, కలువరాయి, మెట్టవలస, గ్రామాల్లో ఒక్కోటి చొప్పున ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డ్రిప్ విధానంలో మొత్తం 35.17 హెక్టార్లలో రూ.24.39లక్షలతో యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ ధరలో రైతులకు రూ.10.37లక్షలు సబ్సిడీగా వచ్చిందని చెప్పారు. స్ప్రింక్లర్ల విధానంలో మొత్తం 3.3 హెక్టార్లలో రూ.97వేలలో రూ.45 వేల సబ్సిడీని రైతులు పొందారన్నారు. మైక్రో ఇరిగేషన్ ఇంజినీర్ శ్రీనివాసరావు, ఎఫ్‌సీఓ రాజేష్, ఏఓ శంకర్, వీఏఏ నాయుడు, రైతులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: ప్రజలకు గ్రామ స్థాయిలోనే నిపుణులైన వైద్యులతో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, ఈ వైద్య శిబిరాల్లో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి మారుతీనగరం సచివాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ శిబిరంలో చాలా విలువైన మందులు, ఎన్నో రకాల రక్త పరీక్షలు, ఇతర ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారని, ప్రజలు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా గతంలో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, కార్యదర్శి శాసపు వేణుగోపాలనాయుడు, నల్లా శ్రీనివాసరావు, తోట తిరుమలరావు, నరేంద్రకుమార్, మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు, ఏఈ వెంకట్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఆర్ఐ చక్రవర్తి, డాక్టర్ అనూష, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆప్తాలమిక్ అసిస్టెంట్ వసంతరావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కళ్లద్దాలు అందజేస్తున్న డాక్టర్ తలే రాజేష్, తదితరులు

నేడు నీటి సరఫరా నిలుపుదల

రాజాం సిటీ: పట్టణంలోని పలు వీధులకు గురువారం నీటి సరఫరా నిలుపుదల చేస్తున్నామని కమిషనర్ ఎంవీ నాగరాజు బుధవారం తెలిపారు. పైపులైన్ మార్పుచేస్తున్నందున గొల్లవీధి, చాకలివీధి, తెలగవీధి, హరిజనవీధి, మాదిగవీధి, కొండంపేట ప్రాంతాలకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు గమనించాలని కోరారు.

పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట

రామభద్రపురం: ప్రతీ సంక్షేమ పథకం అమలులో అవినీతికి తావులేకుండా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తోందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రామభద్రపురం గ్రామంలోని లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు లాటరీ పద్ధతిలో ఇంటి నంబర్లు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పట్టాలు అందుకున్న లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా లాటరీ పద్ధతిలో స్థలాలు కేటాయిండం జరిగిందన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లోనే ప్రభుత్వం స్థలాలు మంజూరు చేసిందన్నారు. దీనిలో ఎవరి ప్రమేయం లేదన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం ఇంటి పట్టాలు మంజూరు చేసిందన్నారు. లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ రాజకీయాలకతీతంగానే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.సులోచరాణి, జేసీఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు లాటరీ పద్ధతిలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి, తహసీల్దార్ సులోచనరాణి

పోలింగ్ కేంద్రం పరిశీలన

వంగర: గ్రామాల్లో ప్రజలు శాంతియుతంగా మెలగాలని ఎస్సై వై.వి.జనార్దన్ కోరారు. మండలంలోని రాజులగుమ్మడ గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. ఎటువంటి వివాదాలకు పోకుండా సోదర భావంతో మెలగాలని సూచించారు.

ఓటు విలువ తెలిసేలా..

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా బుధవారం పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, రంగవల్లులు, తదితర పోటీలను నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఆవశ్యకతను అధికారులు విద్యార్థులకు వివరించారు. ఓటర్లను చైతన్యం చేసేందుకు తొమ్మిది అంశాలతో ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్



బాడంగి: ఎమ్మార్సీ వద్ద విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న తహసీల్దార్ రఫీజాన్, ఎంఈఓ–2 రాజేశ్వరి



తెర్లాం: హైస్కూల్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు



బొబ్బిలి: ఓటర్ల దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ దోల రాజేశ్వరరావు


'ఆడుదాం ఆంధ్రా' నియోజకవర్గ స్థాయి పోటీలు ప్రారంభం

బొబ్బిలి: ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో క్రీడా పోటీలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ పి.బ్రహ్మాజీరావు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాల నాయుడు, ఎంపీడీఓ పోతుల రవికుమార్, జడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, కేజీబీవీ ప్రిన్సిపాల్ పి.స్వప్న, జేసీఎస్ మండల ఇన్‌ఛార్జి తమ్మిరెడ్డి దామోదరరావు, మున్సిపల్ టీపీఆర్వో జగన్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను ప్రోత్సహించేందుకే..

రాజాం సిటీ: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక జీసీఎస్ఆర్ మైదానంలో నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. తొలిరోజు జరిగిన పోటీల్లో రాజాం ఆదర్శనగర్ బాలురు జట్టు, బొద్దాం బాలికల జట్టు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, కమిషనర్ ఎంవీ నాగరాజు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

- తెర్లాం: 'ఆడుదాం ఆంధ్రా' నియోజకవర్గ స్థాయి పోటీల్లో వాలీబాల్, కబడ్డీ విభాగంలో తెర్లాం మండలం విజయరాంపురం, పణుకువలస సచివాలయాల జట్లు ఉత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. క్రీడాకారులను ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, తహసీల్దార్ బి.రత్నకుమార్, పీడీలు, పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు, పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.
- బాడంగి: 'ఆడుదాం ఆంధ్రా' నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన జట్లను ఎంపీడీఓ ఆంజనేయులు బుధవారం ప్రకటించారు. బుధవారం నుంచి వారం రోజుల పాటు బొబ్బిలిలోని ఏపీ రెసిడెన్షియల్ పాఠశాల మైదానంలో పోటీలు జరుగుతాయన్నారు. నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన వారంతా ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచాలని సూచించారు.



బొబ్బిలి: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



రాజాం సిటీ: టాస్ ఎగురవేస్తున్న డాక్టర్ తలే రాజేష్